రౌడీషీటర్, పాత నేరస్తుడి అరెస్టు

మాట్లాడుతున్న ఖమ్మం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది

ఖమ్మం, మార్చి 4: కొంతకాలంగా ఖమ్మం నగరంలో పలు నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ రౌడీషీటర్‌ను, ఓ పాత నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. స్థానిక పీఎస్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీలో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో మంగళవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోతున్నారు. వారు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. వారిని ఖమ్మం ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మద్దంగుల నవీన్ (29), మంజుల విజయ్‌కుమార్ (27)గా గుర్తించారు. కొంతకాలంగా నగరంలోని ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తూ పలు నేరాలకు పాల్పడినట్లు ధ్రువీకరించి అరెస్టు చేశారు. వీరు గత నెల 9న ఎన్నెస్పీ కాలనీలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి ఆపి బెదిరించారు. అతడి బ్యాగులో ఉన్న రూ.30 వేలను లాక్కొని పారిపోయారు. కవిరాజునగర్‌లో గత నెల 14న అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కళ్లలో కారంచల్లి బ్యాగు లాక్కోవడానికి ప్రయత్నించారు. అతడు ప్రతిఘటించడంతో పారిపోయారు. బ్యాగులతో బైకులపై వెళ్తున్న వారిని తరచూ అడ్డగిస్తూ డబ్బులు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి కేసులతోపాటు గొడవలు, సెటిల్మెంట్లు, రెండు హత్యాయత్నాలు సహా సుమారు పది కేసుల్లో నవీన్ నిందితుడిగా ఉన్నాడు. జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి బయట తిరుగుతున్నాడు. ఖమ్మం టూటౌన్ పీఎస్‌లో ఇతడిపై రౌడీ షీట్ కూడా ఉంది. అలాగే, విజయ్‌కుమార్‌పై 2021లో ఖమ్మం అర్బన్ పీఎస్‌లో గంజాయి కేసు కూడా ఉంది. కాగా, మంగళవారం వీరిని రిమాండ్ చేశారు. వీరి నుంచి ఒక స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్?

ఖమ్మంలో ఘటన.. ఆసుపత్రిలో చికిత్స.. డిశ్చార్జి..

ఖమ్మం అర్బన్, మార్చి 4: ఖమ్మంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు మంగళవారం ఉదయం కడుపునొప్పితో బాధపడ్డారు. అనంతరం వారికి వాంతులు కూడా అయ్యాయి. వెంటనే కళాశాల బాధ్యులు ఆ విద్యార్థినులను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. నవ్య, నందిని, కల్యాణి అనే విద్యార్థినుల్లో ఫుడ్ పాయిజన్ లక్షణాలు కన్పించడంతో హాస్టల్లోని మిగిలిన విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలో ఆ విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే విద్యార్థినులు డిశ్చార్జి కావడంతో వారికి తమ ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కళాశాల బాధ్యులను వివరణ కోరగా.. 'కళాశాలలో ఫుడ్ పాయిజన్ కాలేదు.ముగ్గురు ఆదివారం బయట ఫుడ్ తినడంతో కడుపులో నొప్పి వస్తోందని విద్యార్థినులు చెప్పారు. మేం కూడా వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి చికిత్స చేయించాం.' అని సమాధానమిచ్చారు.

సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా తరలించిన కాంట్రాక్టర్

పట్టుకొని అధికారులకు సమాచారం అందించిన గ్రామస్తులు

అక్రమ రవాణా ఇసుకను అడ్డుకున్న గ్రామస్తులు

మధిర, మార్చి 4 : మహదేవపురంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను ఓ కాంట్రాక్టర్ సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ట్రైనీ ఐపీఎస్ రిత్విక్ సాయి, తహసీల్దార్ రాంబాబు మంగళవారం మహాదేవపురం గ్రామానికి చేరుకొని సీజ్ చేసిన ఇసుకను పరిశీలించారు. గ్రామస్తులు సైతం అక్కడికి చేరుకొని కాంట్రాక్టర్ ఇసుక తరలింపు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై ఇసుకను తరలించాడని ఆరోపించారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ కాంట్రాక్టర్ 15 ట్రాక్టర్ల కోసం రూ.22,500 డీడీ తీశారని, అయితే అధికారులకు సమాచారం లేకుండా ఇసుకను తరలించారని పేర్కొన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

హైదరాబాద్ వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు

సత్తుపల్లిలో పోలీసులు అరెస్టు చేసిన అంగన్‌వాడీ యూనియన్ నేతలు, టీచర్లు

సత్తుపల్లిటౌన్, మార్చి 4 : తమ అపరిష్కృత సమస్యలపై వినతిపత్రాలు సమర్పించేందుకు సత్తుపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, టీచర్లను సత్తుపల్లి పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ మినీ టీచర్స్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మెయిన్ టీచర్స్‌గా గుర్తించి వేతనాలు ఇచ్చిందని, అయితే రేవంత్‌రెడ్డి సర్కారు మినీ టీచర్స్‌కు రెండు నెలల వేతనాలు ఇచ్చి మళ్లీ యూటర్న్ తీసుకొని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. ఈ సమస్యపై హైదరాబాద్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఐసీడీఎస్ డైరెక్టర్ దివ్యకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న టీచర్లను అడ్డుకొని అరెస్టు చేయడం సబబు కాదన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉదయ్, నాగేంద్ర, రామేశ్వరి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

రఘునాథపాలెం, మార్చి 4: మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ అయిన ఘటనపై ఖానాపురం హవేలీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. ఖమ్మం మమత రోడ్డులోని రాధాకృష్ణనగర్ రోడ్ నెంబర్–1లో నివాసం ఉండే నున్న లత పంచాయతీరాజ్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తోంది. కాగా, సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో తన హోండా యాక్టివాపై ఇంటికి వస్తుండగా మమత రోడ్డు వద్ద ఓ సీసీ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు బైక్‌పై వచ్చారు. లత మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని వెళ్లిపోయారు.

పారా బ్యాడ్మింటన్‌లో 'నిర్మల్ హృదయ్' ప్రతిభ

ఖమ్మం అర్బన్, మార్చి 4: ఖమ్మంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అస్మారుహి 7వ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంతో గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం పద్మజ మంగళవారం తెలిపారు. విజయం సాధించిన సదరు విద్యార్థినిని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కరస్పాండెంట్ వంగా సాంబశివరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రావణి అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి

పెద్దాసుపత్రి తనిఖీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రోగుల కేస్ షీట్స్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్, విద్యార్థి ఏఐ బోధనను నేర్చుకునే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం సిటీ, మార్చి 4 : ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా సార్వజనీన ఆసుపత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. క్యాజువాలిటీ, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్, ఎంపీహెచ్ డబ్ల్యూ ట్రైనింగ్ సెంటర్, ఎంసీహెచ్, ఓపీ, ఇన్ పేషెంట్స్ వార్డ్స్, గుండె సంబంధిత సెంటర్, కళ్ల చికిత్స కేంద్రం, గర్భిణుల వార్డు, మైత్రి ట్రాన్స్ క్లినిక్, మందులు, సరుకులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందుల పంపిణీ, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మహిళాశక్తి పథకంలో భాగంగా నడుపుతున్న క్యాంటిన్, సత్యసాయి సేవా అన్నదాన కేంద్రాన్ని సందర్శించి రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్, ఆర్ఎంవో డాక్టర్ బి.రాంబాబు, పలువురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఏఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన

జిల్లాలో 7 స్కూళ్లలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలు: కలెక్టర్

ఖమ్మం అర్బన్, మార్చి 4: సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. నగరంలోని ఎన్ఎస్పీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ విద్యాబోధనను మంగళవారం ఆయన పరిశీలించారు. ఏఐ విద్యాబోధన కోసం అవలంబిస్తున్న పద్ధతులపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మంచిగా నేర్చుకునే అనుభవం కలిగేలా బోధించాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ సహాయంతో ప్రయోగాత్మకంగా నూతన బోధన పద్ధతులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టులుగా ఏడు ప్రభుత్వ పాఠశాలలను ఎంపికచేసినట్లు తెలిపారు. ఏఎంవో రవికుమార్, ఎంఈవో శైలజాలక్ష్మి, తులసి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు

కారేపల్లి, మార్చి 4: సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కారేపల్లి ఎస్సై ఎన్ రాజారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండల కేంద్రంలో విభిన్న వర్గాల మధ్య భూ వివాదమై సోషల్ మీడియాలో ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఎవరైన మతపరమైన అంశాలకు సంబంధించి కించపరుస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టినా, వాయిస్ రికార్డులు పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టు పెట్టిన వ్యక్తులతో పాటు, గ్రూపు అడ్మిన్లపై కూడా చర్యలు ఉంటాయనారు.

గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో నేషనల్ సైన్స్‌డే

కొణిజర్ల, మార్చి 4: మండలంలోని తనికెళ్ల గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నేషనల్ సైన్స్‌డేలో బహుమతులు సాధించారు. కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగాయి. మాక్ పార్లమెంట్ పోటీల్లో గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థినులు మొదటి బహుమతి పావని, రెండో బహుమతి స్వచ్ఛత గెలుపొందారు. వారికి టీపీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌రావు, టీ.లక్ష్మణ్‌రెడ్డి, ఎన్ఐటీ ప్రొఫెసర్ వీ.సాంబశివారెడ్డి అందజేశారు. గెలుపొందిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రజిత, ఎం.నవ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కే.ఐశ్వర్యరాణి, సీజీసీ కోఆర్డినేటర్ కే.రజని, ఎగ్జాంబ్రాంచ్ ఇన్‌చార్జి బీ.రాజేశ్వరి, అధ్యాపక బృందం అభినందించారు.

విధుల పట్ల అలసత్వం వహించవద్దు

సత్తుపల్లి: మాట్లాడుతున్న పీడీ రాంగోపాల్‌రెడ్డి

పెనుబల్లి, మార్చి 4: అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ల పనితీరు మెరుగ్గా ఉండాలని, విధుల పట్ల అలసత్వం వహించవద్దని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం కల్లూరు ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లతో ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, కేంద్రం పరిధిలోని రికార్డులు సక్రమంగా నమోదయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీడీపీవో నిర్మలాజ్యోతి, ఏసీడీపీవోలు మెహరున్నీసాబేగం, రత్తమ్మ, సూపర్‌వైజర్లు దొడ్డపునేని భవానీ, రాజ్యలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

చిన్నారుల ఫేస్ ఐడెంటిఫికేషన్ తప్పనిసరి

సత్తుపల్లి, మార్చి4: అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ అయిన చిన్నారుల ఫేస్ ఐడెంటిఫికేషన్ తప్పనిసరి అని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారి కీసర రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు ప్రాజెక్టు సీడీపీవో నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు నిర్వహించిన ఫేస్ ఐడెంటిఫికేషన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల చిన్నారులకు ఫేస్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత టీహెచ్‌ఆర్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవోలు రత్తమ్మ, మెహరున్నీస్సాబేగం, నవ్య, యూసీడీ శివరామకృష్ణ, ఎల్‌డీసీ విష్ణు, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సుజాత, భవానీ, వెంకటమ్మ, మల్లీశ్వరి, రాజ్యలక్ష్మి, సత్యావతి, రోజా, రత్నకుమారి, అనురాధ, బీసీ హరీశ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

తనిఖీలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

వైరాటౌన్, మార్చి 4: వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం ఆమె వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో ఉపాధి హామీ కూలీలతో కొద్దిసేపు ముచ్చటించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున జాగ్రత్తగా ఉండాలని, పని వేళల్లో మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల మధ్య తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని, వడగాల్పుల వలన వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, మార్చి 4: జేఎన్‌టీయూ హైదరాబాద్ వారు ప్రకటించిన బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ట్రిపుల్‌ఈలో షేక్ రహ్మత్‌పాషా 8.95 ఎస్‌జీపీఏ, కనపర్తి గోపిచంద్ 8.6 ఎస్‌జీపీఏ, మండలోజు మేఘన 8.4, మెకానికల్‌లో మోరంపూడి హేమంత్ 7.9, గంధం రామకృష్ణ 69.5, ఈసీఈలో నల్లగోపు శ్రీవిద్య 9.25 ఎస్‌జీపీఏ, తొర్లపాటి రమ్య 9.2, చిలకమర్తి సత్య హర్షిత 9.15, మానికల సాయికిరణ్ 9.15, సీఎస్ఈలో నాగళ్ల ఇందు 9.4, పాలెం హరికీర్తి 9.35, చారుగుండ్ల వెంటసాయిఅమృతవర్గేవి 9.25, తడికమల్ల పుష్పలత 9.7, సీఎస్ఎంలో చిరుమామిళ్ల వర్షిణి 9.4, షేక్ సమీర 9.05, పుప్పాల నాగశివకుమార్ 8.65 ఎస్‌జీపీఏ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను రాజ్యసభ సభ్యులు, కళాశాల చైర్మన్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విథ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

బీటెక్ ఫలితాల్లో 'విజయ' విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, మార్చి 4: జేఎన్‌టీయూ విడుదల చేసిన బీటెక్ థర్డ్ ఇయర్ ఫలితాల్లో విజయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. సీఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో డేటా సైన్స్ విద్యార్థులు ముప్పాల అన్వేద 92 శాతం, పద్మభూమిక 91 శాతం, భజినేని ఇందు 88 శాతం, మహేంద్ర 91, బండారు సంధ్య 88 శాతం, సీఎస్సీ విద్యార్థులు సుంకు స్నేహలత 90శాతం, చుక్కల సాయిసుమంజలి 90 శాతం, సీఈసీ విభాగంలో పిట్టల భూమిక 83 శాతం, ఇద్దేగాని అనూష 87 శాతం, ఈఈఈ విభాగంలో పి.ప్రియాంక 92 శాతం, తోట గీత 90 శాతం మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా అభినందించారు.

పరీక్షల నిర్వహణలో సీఎస్‌లు, డీవోలే కీలకం: ఏసీ

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో శర్మ

ఖమ్మం అర్బన్, మార్చి 4: పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు (డీవో) కీలకమని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. పదో పరీక్షల సీఎస్‌లు, డీవోలతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 97 సెంటర్లలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. 97 సెంటర్లలో 20సీ సెంటర్ల కస్టోడియన్లు హాజరయ్యారు. డీఈవో సోమశేఖరశర్మ, ఇన్‌చార్జి ఏసీ రమేశ్, రిసోర్స్‌పర్సన్లు వీరస్వామి, నారాయణ, సీఎస్‌లు, డీవోలు, జాయింట్ కస్టోడియన్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

ఎర్రుపాలెం, మార్చి 4: మండలంలోని మామునూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర, నీటి పారుదల శాఖ డీఈఈ సాంబశివరావు, మండల వ్యవసాయాధికారి బోయినపల్లి సాయిశివ వరి, మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. మామునూరు గ్రామంలోని వరి, మొక్కజొన్న రైతులతో ప్రస్తుత పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి రైతులు బోరుబావుల ద్వారా నీటిని పంట పొలాలకు అందించి నీటిఎద్దడి లేకుండా చూసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో రైతువేదికలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈఈలు, వ్యవసాయ విస్తరణ అధికారులు గుగులోతు గోపి, బండి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

10న మరో మిలియన్ మార్చ్

ఖమ్మం రూరల్, మార్చి 4: ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయంపై ఈనెల10వ తేదీన హైదరాబాద్‌లో మరోమారు మిలియన్ మార్చ్ తలపెట్టినట్లు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్‌కమిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ బత్తుల సోమయ్య అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో జరిగిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం, తెలంగాణ అస్థిత్వానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యమనాయకులు గుంటి పుల్లయ్య, తీగల రాములు, అంబాల రామారావు, తునికిపాటి చారి, రాజేశ్, పాలకుర్తి కృష్ణ, అశోక్‌సింగ్, ఉల్లంగి పద్మ, వీరబాబు, గురువయ్య, భిక్షం పాల్గొన్నారు.

జమలాపురం ఆలయ అర్చకుడు మృతి

ఎర్రుపాలెం, మార్చి 4: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకునిగా విధులు నిర్వహిస్తున్న ఉప్పల సుదర్శనశాస్త్రీ(60) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుదర్శనశాస్త్రీ మృతి పట్ల ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈవో వై.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు విజయదేవశర్మ, కాసులనాటి రామకృష్ణశాస్త్రీ, మురళీశాస్త్రీ, సిబ్బంది తమ సంతాపాన్ని తెలిపారు.

'సంకల్ప్' అమలుకు ప్రణాళిక రూపొందించాలి: ఏసీ

ఖమ్మం, మార్చి 4: నైపుణ్య, శిక్షణ కార్యక్రమాల అమలు కోసం పక్కా ప్రణాళికలు రూపొందించాలని అదనపు కలెక్టర్ (ఏసీ) శ్రీజ అధికారులకు సూచించారు. 'స్కిల్ అక్విజిషన్, నాలెడ్జ్ అవేర్నెస్ ఫర్ లైవ్లీ హుడ్ ప్రమోషన్' (సంకల్ప్) కార్యక్రమంపై జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా నైపుణ్య అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ కింద చేపట్టే కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ట్రెండ్, డిమాండ్ ప్రకా రం అవసరమైన కోర్సుల్లో యువతకు శిక్షణ అందించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. వివి ధ శాఖల అధికారులు ఎన్.మాధవి, కే.సత్యనారాయణ, జీ.జ్యోతి, నవీన్ బాబు, పురంధర్, విజేత, సీతారాం, సుజాత పాల్గొన్నారు.

సాగర్‌జలాలతో చెరువులు నింపి పంటలను కాపాడాలి

మధిర, మార్చి 4: సాగర్‌జలాలతో చెరువులు నింపి పంటలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం మధిరలో దివ్వెల వీరయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం మధిర నియోజకవర్గ సమావేశంలో పోతినేని మాట్లాడారు. పంట పొలాలు నీళ్లందక ఎండిపోతున్నాయని, చివరి భూముల వరకు సాగర్‌జలాలు అందించాలన్నారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న, మిర్చి, పండ్లతోటల రైతులు సాగర్‌జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మిర్చికి గిట్టుబాటు ధరను క్వింటాకు రూ.25 వేల చొప్పున ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేయాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మడుపల్లి గోపాలరావు, బండి పద్మ, శీలం నర్సింహారావు, దొండపాటి నాగేశ్వరరావు, మందా సైదులు, బట్టు పురుషోత్తం, కిలారు సురేశ్, రాచబంటి రాము, పడికంటి మురళీ, మద్దాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'టెక్నికల్ సృజన ఫెస్ట్'

మధిర, మార్చి 4: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు 'టెక్నికల్ సృజన ఫెస్ట్ 2024–25' కార్యక్రమాన్ని మంగళవారం మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. జిల్లాస్థాయి టెక్నికల్ సృజనఫెస్ట్‌లో గెలుపొందిన ప్రాజెక్టులను హైదరాబాద్ రాష్ట్రస్థాయి సృజన టెక్‌కు ఎంపిక చేస్తారు. విద్యార్థులు యోగాత్మకంగా తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించిన వాటిని నిర్వాహకులు పరిశీలించారు. ప్రిన్సిపాల్ కే.సాంబయ్య మాట్లాడుతూ అందరికీ అందుబాటులో అతి తక్కువ ఖర్చుతో పాలిటెక్నిక్ విద్య అందుబాటులో ఉంటుందన్నారు. మెకానికల్ డిపార్ట్‌మెంట్ విజయలక్ష్మి, సివిల్ డిపార్ట్‌మెంట్ సాంబశివరావు, వర్క్‌షాపు సూపరింటెండెంట్ బీ.రమేశ్, పాల్గొన్నారు.

పద్మశ్రీ వనజీవి రామయ్యను కలిసిన ఫారెస్టు బీట్ ఆఫీసర్లు

వనజీవి దంపతులతో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు

ఖమ్మం రూరల్, మార్చి 4: పద్మశ్రీ వనజీవి దరిపెల్లి రామయ్య దంపతులను ఫారెస్టు అకాడమీ 35 బ్యాచ్‌కు చెందిన ట్రైనింగ్ ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని వనజీవి ఇంట్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అడవుల పెంపకం, చెట్లను నాటే విధానం తదితర అంశాలపై తన అనుభవాలను రామయ్య వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, కూసుమంచి రేంజ్ ఆఫీసర్ పీ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కేవీ రామారావు, కొండల్‌రావు, డెనియల్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మధు పాల్గొన్నారు.

'పీఎం ఇంటర్న్‌షిప్' దరఖాస్తులకు 11 ఆఖరు తేదీ

ఖమ్మం, మార్చి 4: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ (పీఎం ఇంటర్న్‌షిప్) కోసం ఈ నెల 11లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా పరిశ్రమల అధికారి టీ.సీతారాం మంగళవారం తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థులకు నెలవారీగా రూ.ఐదు వేల భత్యం అందిస్తామన్నారు. 12 నెలల ఇంటర్న్‌షిప్ వ్యవధిలో కనీసం ఆరు నెలల పాటు ఉద్యోగ శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న యువతీ యువకులు pminternship.mca.gov.in అనే పోర్టల్‌లోకి లాగిన్ అయి ఆసక్తి గల రంగాల్లో గరిష్ఠంగా ఐదు ఇంటర్న్ షిప్‌ల వరకూ ఎంపిక చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 180011 6090లో సంప్రదించాలని సూచించారు.

'ఖమ్మంలో రేపు జాబ్ మేళా'

ఖమ్మం, మార్చి 4: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ)లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.మాధవి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్, జీజే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ఖమ్మం రూరల్, మార్చి 4: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాలకు చెందిన 58మంది విద్యార్థులు డాన్‌బోస్ కంపెనీకి ఎంపికయాయరని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. ఐటీ కంపెనీలకు సమానంగా కోర్ కంపెనీలను సైతం నియామకాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపికైన వారిలో 39మంది ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు, 9మంది ఎలక్ట్రికల్, మరో పదిమంది మెకానిక్ విద్యార్థులు ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్లు శ్రీవిద్య, సాయిగీతిక అభినందించారు.

'గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

ఖమ్మం సిటీ, మార్చి 4: గర్భిణుల ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి సూచించారు. ఆర్మన్ సహకారంతో 'అమ్మకోసం' అనే అంశం ఖమ్మం ఐడీవోసీలో ఏఎన్‌ఎంలకు ఇచ్చిన ఒక్కరోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో మాతృ మరణాలను తగ్గించి ఆరోగ్యవంతమైన అమ్మకోసం పాటుపడాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ఆర్మన్ ఆర్గనైజేషన్ బాధ్యురాలు డాక్టర్ అఖిల, టీవోటీలు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చందన, ఎస్.శేషుపద్మ, ఎన్ రఘురాం, నాగరాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మధిర మార్చి 4: గర్భిణుల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నివారణపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ మాట్లాడుతూ... ప్రతి గర్భిణుల ఆరోగ్యంపై పారా మెడికల్ సిబ్బంది దృష్టి సారించి హైరిస్క్ గర్భిణులను గుర్తించల్లన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, ఆశ నోడల్ పర్సన్ బీ.సరోజినీదేవి, ఆశ ఫెసిలీటేటర్ విజయకుమారి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రంలో లైన్‌మెన్‌డే

పెనుబల్లి, మార్చి4: కల్లూరు విద్యుత్ ఉపకేంద్రంలో లైన్‌మెన్‌డే ఉత్సవాలను విద్యుత్ అధికారి వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సంస్థ మనుగడ కోసం, తమ బాధ్యతలను, విధులను తమ కర్తవ్యంగా భావిస్తూ వినియోగదారుల పట్ల స్నేహభావంతో ఉంటామని, వారికి అన్ని వేళలా అందుబాటులో ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎల్.రవి, లైన్ ఇన్‌స్పెక్టర్లు బత్తుల సత్యనారాయణ, ఉస్మాన్‌బేగ్, గ్రామీణ లైన్‌మెన్లు శ్రీను, మురళీ, రమేశ్, జాన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్లను, బిల్లు కలెక్టర్లను, స్పాట్ బిల్లర్లు కిరణ్, రాజారావును సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌మెన్ సబ్‌ఇంజినీర్ పీ.గురునాథం, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మెన్స్‌కు సన్మానం

వేంసూరు, మార్చి 4: వేంసూరు సెక్షన్‌ఆఫీసులో లైన్‌మెన్ దివాస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న విద్యుత్ సిబ్బందికి ఏఈ అంకంరావు, సబ్‌ఇంజినీర్ సాగరిక సన్మానించారు. సత్తుపల్లి అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, డివిజనల్ ఇంజినీర్ రాములు, విద్యుత్‌శాఖ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఏదులాపురం మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రారంభం

ఖమ్మం రూరల్, మార్చి 4: మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పున:ప్రారంభమైంది. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ కుమార్, ఏదులాపురం మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ షఫీఉల్లా ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. గతంలో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం) కింద దరఖాస్తులు చేసుకున్న భూ యజమానులకు సంబంధించిన పూర్తి వివరాలను సమీక్ష చేశారు. అనంతరం ప్రస్తుత మున్సిపాలిటీకి సంబంధించిన 12మంది పంచాయతీల కార్యదర్శులను ఎంపీడీవో దిశా నిర్దేశం చేశారు. ఆయా పంచాయతీల పరిధిలోని పెండింగ్ దరఖాస్తుదారుల జాబితాను అందజేశారు. ప్రస్తుత మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు 13,659మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

8న రాయల విగ్రహావిష్కరణ

తిరుమలాయపాలెం, మార్చి 4: మండలంలోని పిండిప్రోలులో ఈ నెల 8వ తేదీన స్వర్గీయ రాయల నాగేశ్వరావు విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరావు తెలిపారు. మంగళవారం పిండిప్రోలులో జరిగిన పార్టీ మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయల నాగేశ్వరావు పిండిప్రోలు సర్పంచ్‌గా, ఎంపీటీసీగా సేవలందించారన్నారు. సమావేశంలో నాయకులు తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, పుసులూరి పుల్లయ్య, ఆరెంపుల వెంకన్న, శంకర్, గోకినపల్లి సరోజన, మీగడ సత్యం తదితరులు పాల్గొన్నారు.